నమస్తే తెలంగాణ
సూర్యాపేట
I | నల్లగొండ, గురువారం 24 ఏప్రిల్ 2025 | SURYAPET

దంచికొడుతున్న ఎండలు

- 42.6 డిగ్రీలకు చేరిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

భువనగిరి కలెక్టరేట్/నేరేడుచర్ల, ఏప్రిల్ 23 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం జనగాంలో అత్యధికంగా 42.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా అన్ని మండలాల్లో 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు ఉన్నాయి. రామన్నపేట, గుండాల మండలాల్లో 42.5, బీబీనగర్ మండలం వెంకిర్యాల, రాజాపేటలో 42.4, చౌటుప్పల్, మోత్కూరు మండలం బిజ్లాపూర్‌లో 42.2, రాజాపేట మండలం పాముకుంట, వలిగొండ మండలం వెంకటాపురంలో 42.1, ఆలేరు మండలం కొలనుపాక, అడ్డగూడూర్, ఆత్మకూరులో 42, చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట్, మోత్కూరు మండలం దాతప్పగూడెంలో 41.9, భువనగిరిలో, బొమ్మలరామారం, మోటకొండూర్‌లో 41.8, తుర్కపల్లిలో 40.9, యాదగిరిగుట్టలో 40.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రెండు రోజులుగా ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు, ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు చల్లని పానీయాలను తాగుతున్నారు. కూలర్లు, ఏసీల వాడకం పెరిగింది.

అకాల నష్టం

వరుస వర్షాలకు దెబ్బ తిన్న పంటలు.. కుదేలైన రైతులు

యాదాద్రి జిల్లాలో 800 ఎకరాల్లో పంట నష్టం

పలు మండలాల్లో నేలరాలిన మామిడి

ఇప్పటికే సాగు నీరు లేక వేల ఎకరాలు ఆగం

నష్టపరిహారం పట్టని రాష్ట్ర ప్రభుత్వం

బీఆర్ఎస్ హయాంలో రూ. 7 కోట్ల సాయం

ఆరుగాలం కష్టించిన అన్నదాతకు ఆఖరికి కన్నీరే మిగులుతున్నది. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి చేసిన కష్టమంతా వర్షార్పణమవుతున్నది. ఇటీవల వరుసగా భారీ ఈదురుగాలులతో కురుస్తున్న వానలకు పంట తడిసి ముద్దవుతున్నది. మామిడి తోటల్లో కాయలు నేల రాలుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కనీసం పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

– యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ)

గాలి దుమారానికి ఈ నెల 21న తుర్కపల్లిలో నేలరాలిన మామిడి కాయలు

యాదాద్రి భువనగిరి జిల్లాలో యాసంగి సీజన్‌లో 3.19లక్షల ఎకరాల్లో సాగు అంచనా ఉండగా, 2.80లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేశారు. ఇందులో అధిక శాతం వరి సాగు చేశారు. ఓ వైపు నీళ్లు లేక.. మరో వైపు ఎర్రటి ఎండలతో కండ్లముందే వరి పొలాలు ఎండిపోతున్నాయి. పొట్ట దశలో పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. కొందరు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీళ్లు పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకొందరు పంటలు ఎండిపోవడంతో పశువులకు మేతగా వినియోగిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 20వేలకు పైగా ఎకరాలు దెబ్బతిన్నట్లు తెలుస్తున్నది. జిల్లాలో సుమారు రెండు లక్షలకు పైగా రైతులు ఉన్నారు.

ఈ 20న మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో వరదకు కొట్టుకుపోయిన ధాన్యం

800 ఎకరాల్లో పంట నష్టం..

జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు, తోటలు దెబ్బతిన్నాయి. ఈ నెల 3,13,15, 20 తేదీల్లో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. దాంతో జిల్లాలో సుమారు 800 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు తేల్చారు. ముఖ్యంగా తుర్కపల్లి, బొమ్మలరామారం, మోత్కూరు, రామన్నపేట, చౌటుప్పల్, వలిగొండ, యాదగిరిగుట్ట తదితర మండలాల్లో నష్టం జరిగింది. ఒక్కో ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేసినా.. రూ.నాలుగైదు కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. మామిడి తోటలు లీజుకు తీసుకున్న వారు సైతం నష్టం చవిచూడాల్సి వచ్చింది.

బీఆర్ఎస్ హయాంలో రూ. 7 కోట్ల పరిహారం..

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. పదేండ్ల పాలనలో రైతులు సుభిక్షంగా ఉన్నారు. సాగు నీరు, పెట్టుబడి సాయం, ఎరువులు, మద్దతు ధర, ధాన్యం కొనుగోళ్లు సైతం సజావుగా కొనసాగాయి. పంట నష్టం జరిగిన సమయంలో రైతులను ఆదుకునే ప్రయత్నం చేసింది. 2023లో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పెద్ద ఎత్తున పంట నష్టం జరిగింది. దీంతో ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందించింది. ఇలా జిల్లాలో రూ. 7కోట్ల సాయం అందించి రైతులపై ఉన్న ప్రేమను చాటుకుంది.

కనీసం భరోసా కూడా ఇవ్వని కాంగ్రెస్..

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం దేవుడెరుగు కనీసం ధైర్యం, భరోసా కూడా కల్పించలేదు. పంట నష్టానికి సంబంధించి పరిహారంపై ప్రకటన చేయలేదు. కేవలం వ్యవసాయ అధికారులను ప్రాథమిక నష్టం జాబితా పంపించాలంటూ ఆదేశాలు జారీ చేసి.. చేతులు దులుపుకొన్నది. మరోవైపు సమగ్ర పంటల బీమా పథకాన్ని తీసుకొస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ పత్తాలేకుండా పోయింది. ఏకంగా హస్తం పార్టీ మ్యానిఫెస్టోలోనూ పొందుపరిచింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటిపోయినా ఊసే లేదు.

పంట నష్ట పరిహారం చెల్లించాలి

జిల్లాలో వరుస అకాల వర్షాలకు పెద్ద ఎత్తున పంటలు నష్టపోయారు. ప్రభుత్వం పంట పెట్టుబడి ఇవ్వకున్నా అప్పో సొప్పో తెచ్చి పండించినా వరుణుడు కరుణించలేదు. రైతులు అప్పుల పాలై దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ఇలాంటి సమయంలో ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. కానీ సర్కారు మాత్రం తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నది. రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాల్సిందే.

- కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు

బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భగత్ వేదికపై ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ట్రైకార్ చైర్మన్ రామచందర్‌నాయక్

రజతోత్సవ సభకు ప్రతి ఊరు నుంచి తరలిరావాలి

- బీఆర్ఎస్ హయాంలోనే అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి
- ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భగత్

త్రిపురారం, ఏప్రిల్ 23 : వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రతి గ్రామం నుంచి స్వచ్ఛందంగా తరలి రావాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. త్రిపురారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన మండల ముఖ్య నాయకుల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను వరంగల్ సభ ద్వారా ఎండగట్టడానికి ప్రతి ఇంటి నుంచి తరలి రావాలని పిలుపునిచ్చారు. 27న ఉదయం 8గంటల వరకు అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు హాలియా పట్టణానికి చేరుకోవాలన్నారు. ప్రజలు, పార్టీ శ్రేణులకు కేసీఆర్ సభ ద్వారా దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి మాటలు తప్ప చేతలు లేవని, హామీల అమలుపై ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తే నేడు కాంగ్రెస్ పాలనలో కుంటుపడిందని మండిపడ్డారు. గ్రామాల్లో ఇప్పటికే 80శాతం ప్రభుత్వం మీద వ్యతిరేకత కొనసాగుతుందని, ఈ సభ అనంతరం ప్రజలు తిరగబడడం ఖాయమని తెలిపారు. మాజీ ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రామచందర్‌నాయక్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పాలనలో ఏ ఒక్కరు కూడా సుభిక్షంగా లేరని, రైతులకు రుణమాఫీ సరిగా చేయలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అరాచకాలను ఎండగట్టేందుకే రజతోత్సవ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రజతోత్సవ సభతో తెలంగాణలో కొత్త మార్పు వస్తుందని చెప్పారు. సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కామర్ల జానయ్య, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు పామోజు వెంకటాచారి, గగ్గనపల్లి వనజ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గుండెబోయిన వెంకటేశ్వర్లు, నాయకులు బాబురావునాయక్, కలకొండ వెంకటేశ్వర్లు, మడుపు వెంకటేశ్వర్లు, సుశీల్‌నాయక్, శ్యాంసుందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కొణకంచి సత్యం పాల్గొన్నారు.

చిలుకూరులో బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

వరంగల్ సభకు దండుగా కదిలిరావాలి

- అపర భగీరథుడు కేసీఆర్.. పదేండ్ల పాలనలో సంతోషంగా ప్రజలు
- కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

చిలుకూరు, ఏప్రిల్ 23 : ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు దండుగా కదిలి రావాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పిలుపునిచ్చారు. సభ విజయవంతం కోసం బుధవారం చిలుకూరులో పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో చిరస్థాయిలో నిలిచిపేలా రజతోత్సవ సభ జరుగుతుందని తెలిపారు. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడదామన్నారు. అపర భగీరథుడు కేసీఆర్ ఉపన్యాసం వినేందుకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమతున్నారని, బీఆర్ఎస్ శ్రేణులు గ్రామాల్లో ర్యాలీలు, సభలు ఏర్పాటు చేసి అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అక్కినపల్లి జానకిరామాచారి, ప్రధాన కార్యదర్శి అంబాల ఉపేందర్, నాయకులు కస్తూరి నర్సయ్య, జానిమియా, అల్సకాని జనార్దన్, కొండా అన్నపూర్ణ, పాషా, మాధవరపు శ్రీను, లింగరాజు, పిచ్చయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

వెయ్యికరాల్లో నిమ్మ తోటలు ధ్వంసం

- ఈదురుగాలులకు తీవ్రంగా నష్టపోయిన మూడు మండలాల రైతులు
- ఎకరానికి రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని వేడుకోలు

నకిరేకల్, ఏప్రిల్ 23 : ఇటీవల వచ్చిన ఈదురుగాలుల వర్షానికి నకిరేకల్, శాలిగౌరారం, కేతేపల్లి మండలాల్లో పెద్ద ఎత్తున నిమ్మ తోటలకు నష్టం వాటిల్లింది. కాతకు వచ్చి నిమ్మకాయ తెంపే దశలో పెద్దఎత్తున నష్టం వాటిల్లడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. బయట వడ్డీలకు తెచ్చి, కొంత మేర ఫర్టిలైజర్ షాపులకు బాకీలు పెట్టి పెట్టుబడులు తెచ్చామని, తీరా తెంపేదశలో గాలి దుమారానికి చెట్లన్నీ నేలకొరిగాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నకిరేకల్ మండలంలోని కడపర్తిలో 38 మంది రైతులకు చెందిన 200 ఎకరాల్లో, నోములలో 40 మంది రైతుల 180 ఎకరాల్లో, పాలెంలో 45 మంది రైతుల 180 ఎకరాల్లో, వల్లభాపురంలో ఆరుగురు రైతుల 25 ఎకరాల్లో, నడిగూడెంలో నలుగురు రైతుల 15 ఎకరాల్లో, ఓగోడులో ముగ్గురు రైతుల 6 ఎకరాల్లో, తాటికల్‌లో ఐదుగురు రైతుల 15 ఎకరాల్లో, నకిరేకల్‌లో ఐదుగురు రైతుల 15 ఎకరాల్లో నిమ్మచెట్లు ధ్వంసమయ్యాయి. శాలిగౌరారం మండలంలోని శాలిగౌరారంలో 8 మంది రైతులకు సంబంధించిన 16 ఎకరాల్లో, పెర్కకొండారంలో 36 మంది రైతుల 120 ఎకరాల్లో, ఆకారంలో నలుగురు రైతుల 10 ఎకరాల్లో, పాతకొండారంలో ఇద్దరు రైతుల 5 ఎకరాల్లో, వల్లాలలో 65 మంది రైతుల 240 ఎకరాల్లో తోటలు దెబ్బతిన్నాయి. కేతేపల్లి మండలంలోని గుడివాడలో నలుగురు రైతులకు చెందిన 14 ఎకరాల్లో నిమ్మతోటలు ధ్వంసమయ్యాయి. మూడు మండలాల్లో 265 మంది రైతులకు సంబంధించిన 1,032 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు ఉద్యాన వన అధికారి ప్రవీణ్ పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. ఎకరానికి రూ.2 లక్షల చొప్పున పంట నష్ట పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నిమ్మతోటకు వస్తే కన్నీళ్లు వస్తున్నాయి..

ఎంతో కష్టపడి సాగు చేసిన నిమ్మతోట ఈదురుగాలులకు నేలమట్టం అయ్యింది. తోటకు రావాలంటే కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. నాకున్న 3 ఎకరాల్లో 220 నిమ్మ మొక్కలు నాటాను. కాయ చేతికొచ్చే సమయానికి దాదాపు 50 చెట్లు వేర్లతో లేచి పడ్డాయి. 3 లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. బయట లక్షా 50 వేలు అప్పు తెచ్చిన. ఎరువుల షాపులో లక్షా 50 వేలు బాకీ ఉంది. మొత్తం 3 లక్షలు కట్టాలి. ఈ కారు పంట చేతికొస్తే అప్పు పోనూ లక్ష రూపాయలు చేతికొచ్చేది. పెట్టిన పెట్టుబడి పోయింది. అప్పు మిగిలింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

-బెల్లి వెంకన్న, రైతు, టేకులగూడెం

నకిరేకల్ మండలంలోని పాలెం గ్రామంలో ఈదురుగాలులకు నేలకొరిగిన నిమ్మ చెట్టు

నేటి నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

- ఇంటిబాట పట్టిన హాస్టల్ విద్యార్థులు

నకిరేకల్ : వేసవి సెలవులు వచ్చాయని ఆనందం వ్యక్తం చేస్తున్న పాలెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు

రామగిరి/సూర్యాపేట అర్బన్/నకిరేకల్, ఏప్రిల్ 23 : 2024-25 విద్యా సంవత్సరం ముగిసింది. నేటి నుంచి జూన్ 11 వరకు పాఠశాలలకు విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. విద్యార్థులు చివరి రోజు పాఠశాలలో తమ మిత్రులతో ఆనందంగా గడిపారు. ప్రోగ్రెస్ రిపోర్టులను తీసుకుని ఇంటి దారి పట్టారు. హాస్టల్‌లోని విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి సామగ్రితో సొంతూళ్లకు బయల్దేరారు. దాంతో ఆర్టీసీ బస్టాండ్లు విద్యార్థులతో కిటకిటలాడాయి. పాఠశాలలు జూన్ 12న పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థులను పాఠశాలల్లో చేర్చించేందుకు బడి బాట కార్యక్రమం జూన్ 1న ప్రారంభించనుండగా ఉపాధ్యాయులు ఆ ఆరోజు నుంచి స్కూళ్లకు హాజరుకావాల్సి ఉంటుంది.

ధాన్యం తూకంలో మోసం.. రైతుల ఆందోళన

ఈదులూరు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిరసన తెలుపుతున్న రైతులు

కట్టంగూర్, ఏప్రిల్ 23 : మండలంలోని ఈదులూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకంలో తేడా వచ్చిందని బుధవారం రైతులు ఆందోళన నిర్వహించారు. కొనుగోలు కేంద్రంలో మూడు కంప్యూటర్ కాంటాలు ఉండగా అందులోని ఒక కాంటాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం బస్తా 40కేజీల 600గ్రాముల ఉండాలి. కానీ అదే బస్తాను గ్రామంలోని మరో కంప్యూటర్ కాంటాలో తూకం వేయగా 41 కేజీల 500 గ్రాములుగా చూపించింది. దాంతో రైతులు కొనుగోలు కేంద్రంలో ఆందోళన చేపట్టారు. క్వింటాలుకు రెండున్నర కేజీల వరకు అదనంగా తూకం వేయడంతో తీవ్రంగా నష్టపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తూకంలో జరిగిన మోసంపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సీసీ శంకర్ కొనుగోలు కేంద్రానికి వచ్చి కాంటా బరువు సరి చేస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. నిరసనలో గుడుగుంట్ల వెంకన్న, తవిటి నాగార్జున, బీసం లింగయ్య, నార్ల సత్యనారాయణ, నిమ్మనగోటి వెంకన్న, బెల్లి శేఖర్ ఉన్నారు.

రీసోర్స్‌పర్సన్స్ కోసం దరఖాస్తులు: డీఈఓ

రామగిరి, ఏప్రిల్ 23: జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు మండల, జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్ల కోసం అర్హత, ఆసక్తిగల ఉపాధ్యాయులు ఈ నెల 24లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారి వివరాలు ఈ నెల 28న ప్రకటిస్తామని పేర్కొన్నారు. వివరాలకు క్వాలిటీ కోఆర్డినేటర్ ఆర్.రామచంద్రయ్యను, సెల్ 79955 67558ను సంప్రదించాలని సూచించారు.

30 గంటలు... 60 కిలోమీటర్లు

వరంగల్ సభకు ఉత్సాహంగా కొనసాగుతున్న ఎడ్లబండ్ల యాత్ర

కోలాటాలతో ఊరూరా అపూర్వ స్వాగతం

దంతాలపల్లిలో స్వాగతం పలికిన మాజీ మంత్రి సత్యవతీరాథోడ్

రాత్రి ఎనిమిది గంటలకు తొర్రూరుకు చేరుకున్న యాత్ర

బీఆర్ఎస్ రజతోత్సవ సభ దారిలో దంతాలపల్లి సమీపం వద్ద రైతుల ఎడ్ల బండ్ల యాత్ర

సూర్యాపేట, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : వరంగల్‌లో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మంగళవారం సూర్యాపేట జిల్లాలో ప్రారంభమైన రైతుల ఎడ్లబండ్ల యాత్రకు ఊరూరా అపూర్వ స్వాగతం లభిస్తున్నది. సూర్యాపేట నియోజకవర్గం ఆత్మకూర్.ఎస్ మండలంలోని నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయం వద్ద ప్రారంభమైన యాత్రకు గ్రామగ్రామాన రైతులు, బీఆర్ఎస్ శ్రేణులతో పాటు మహిళలు పెద్దఎత్తున కోలాటాలతో స్వాగతం పలుకుతున్నారు. యాత్ర ప్రారంభమైన 30 గంటల్లో 60 కిలోమీటర్లు ప్రయాణించి బుధవారం రాత్రికి మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చేరుకున్నది. తొలి రోజు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రారంభించగా, దాదాపు 30 కిలోమీటర్లు ప్రయాణించి తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని మద్దిరాలకు చేరుకొని అక్కడే రాత్రి బస చేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ స్వాగతం పలికిన విషయం విదితమే. మద్దిరాల నుంచి బుధవారం ఉదయం ఐదున్నర గంటలకు ప్రారంభమైన ఎడ్లబండ్ల యాత్ర 11గంటల సమయంలో దంతాలపల్లికి చేరుకున్నది. దంతాలపల్లిలో మాజీ మంత్రి సత్యవతీరాథోడ్ స్వాగతం పలికి రైతులతో మాట్లాడారు. రైతులు అక్కడే మధ్యాహ్న భోజనం చేసి సాయంత్రం వరకు బస చేశారు. తిరిగి సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన ర్యాలీ రాత్రి ఎనిమిది గంటలకు తొర్రూరుకు చేరుకుంది. మండుటెండను లెక్క చేయక దాదాపు 130 కిలోమీటర్లు ప్రయాణించేందుకు సూర్యాపేట రైతాంగం చేపట్టిన యాత్రకు అడుగడుగునా అపూర్వ ఆదరణ లభిస్తుండడం విశేషం.